సాక్షి
పెద్దపల్లి
సోమవారం । 20 । మార్చి । 2023



ఆగని రేషన్ బియ్యం దందా

ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేసే సబ్సిడీ బియ్యాన్ని అక్కమార్కులు పక్కదారి పట్టిస్తున్నారు.

8లో▸



ముగిసిన ఎఫ్ఏ మార్కుల పరిశీలన

పదోతరగతి విద్యార్థుల ఫార్మేటివ్ అసెస్మెంట్(ఎఫ్ఏ, అంతర్గత) మార్కుల పరిశీలన ముగిసింది.

8లో▸

గరిష్టం/కనిష్టం
29.0/20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మానేరులోని మట్టిరోడ్డుకు గండి



గండిపడిన మట్టి రోడ్డు

రామగిరి(మంథని): ముత్తారం మండలం ఓడేడ్ వద్ద మానేరులో నిర్మించిన తాత్కాలిక మట్టి రోడ్డుకు ఆదివారం గండి పడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మానేరుకు వరద ప్రవాహం పెరిగింది. దీంతో జిల్లాతోపాటు జయశంకర్‌భూపాలజిల్లాలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇరు జిల్లాల మధ్య మానేరుపై నిర్మిస్తున్న వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఓడేడ్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిల్లపల్లి పంచాయతీల ఆధ్వర్యంలో మానేరులో మట్టి రోడ్డు వేశారు. వర్షం కారణంగా ఆ రోడ్డు కొట్టుకుపోవడంతో ప్రయాణాలు నిలిచిపోయాయి.

సదయ్యగౌడ్‌కు ఉగాది నంది పురస్కారం



అవార్డు అందుకుంటున్న సదయ్య గౌడ్

సుల్తానాబాద్: మంథనిలోని శ్రీగౌతమేశ్వర సాహితీ కళాసేవా సంస్థ ఉగాది నంది పురస్కార్ అవార్డును పట్టణానికి చెందిన ఏగోళపు సదయ్యగౌడ్‌కు సేవా సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీధర్, ఎస్వీఆర్ వెంకటేశ్ అందించారు. కార్యక్రమానికి వైరాగ్యం ప్రభాకర్, మేడగొని రాజమౌళిగౌడ్, పిట్టల రవిబాబు, పర్యావరణవేత్త కొత్త శ్రీనివాస్‌గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏగోళపు కుమార్ చారిటబుల్ ట్రస్టు తరఫున 19ఏళ్లుగా చేస్తున్న సేవలు, కరోన విపత్కర సమయంలో చేసిన సేవలను గుర్తించి నంది పురస్కారాన్ని అందించినట్లు సదయ్యగౌడ్ తెలిపారు.

సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలి



రాస్తారోకో చేస్తున్న అన్నయ్య గౌడ్

సుల్తానాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి రాజీనామా చేయాలని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మినుపాల ప్రకాశ్‌రావు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం సుల్తానాబాద్‌లో రాజీవ్ రహదారిపై ఆందోళన చేశారు. పేపర్ లీక్‌తో ఎంతోమంది నిరుద్యోగుల భవిష్యత్ అంధకారంగా మారిందన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సాహిరి మహేందర్, పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్యగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ



మల్లికార్జునస్వామికి పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల: ఓదెల మల్లన్న సన్నిధికి భక్తులు తరలివచ్చారు. ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేశారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా పాలకమండలి ఏర్పాట్లు చేసింది.

అడ్‌హక్ కమిటీ ఖరారు

పెద్దపల్లిరూరల్: జిల్లా న్యాయస్థాన ఉద్యోగుల సంఘం అడ్‌హక్ కమిటీని ఖరారు చేశారు. గౌరవాధ్యక్షులుగా వేణుగోపాల్, కొమురయ్య, హరినాథ్, అధ్యక్షుడిగా శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా తాండ్ర సుమన్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా మమత వేణు, రిజ్వాన్, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా చలపతిరావు, కోశాధికారిగా మహేశ్, వైస్ ప్రెసిడెంట్‌గా శైలజ, రజనీ, రాజేశ్, రుతు, సుగుణాకర్‌రావు, తిరుపతమ్మ, రాజు, సాయి, హరికృష్ణ, లేడీ రిప్రజెంటెటివ్‌గా తిరుమల, స్వరూపరాణి, పద్మావతి, కృష్ణవేణిని ఎన్నుకున్నారు.

అకాల వర్షం.. తీరని నష్టం

- నేలవాలిన మొక్కజొన్న
- గొలుసు దెబ్బతిన్న వరి
- పూత, కాత రాలిన మామిడి
- ప్రాథమిక అంచనాకొచ్చిన యంత్రాంగం
- 1622 ఎకరాల్లో నష్టపోయినట్లు గుర్తింపు

సుల్తానాబాద్: అన్నదాతలను అకాల వర్షాలు కలవరపెడుతున్నాయి. వడగండ్లకు తోడు ఈదురుగాలులు వీస్తుండటంతో మామిడి, వరి పంటలకు తీరని నష్టం వాటిల్లుతోంది. గురువారం మొదలైన వడగండ్ల వర్షం ఆదివారం రాత్రి వరకూ బీభత్సం సృష్టిస్తూనే ఉంది. రోజుకోచోట కురుస్తూ.. పంటలను ఊడ్చుకెళ్తోంది. జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలకు ఏడు గ్రామాల్లో 92 మంది రైతులకు చెందిన 172 ఎకరాల్లో వరి, 44 గ్రామాల్లోని 1152 మంది రైతులకు చెందిన 1450 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం చేకూరింది. మొత్తంగా 1622 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. మరో నెలరోజుల్లో చేతికొచ్చే మొక్కజొన్న అకాలవర్షంతో నేలవాలిందని రైతుల ఆందోళన చెందుతున్నారు. వడగండ్ల వానతో నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్నామని ఉద్యాన శాఖ జిల్లా అధికారి జ్యోతి తెలిపారు.

జిల్లాలో వర్షపాతం నమోదు ఇలా..

సుల్తానాబాద్‌లో 48.2 మిల్లీమీటర్లు, ధర్మారంలో 71.2, ఎలిగేడులో 27.8, జూలపల్లిలో 9, ఓదెలలో 45.1, కాల్వశ్రీరాంపూర్‌లో 45.1, పెద్దపల్లిలో 25.7 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

అకాల వర్షానికి ఇల్లు నేలమట్టం

సుల్తానాబాద్ పట్టణంలోని యాదవనగర్ కు చెందిన కావేటి మధురయ్య ఇల్లు అకాల వర్షానికి నేలమట్టమైంది. వర్షంతోపాటు గాలివానకు పడిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెవెన్యూ అధికారులు పరిశీలన చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.



ఓదెలలో కూలిపోయిన ఇంటి వద్ద బాధితులు



ధర్మారం మండలంలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

ధర్మారంలో గాలివాన బీభత్సం

ధర్మారం: మండలంలో శనివారం రాత్రి కురిసిన అకాలవర్షానికి మొక్కజొన్న నేలకొరిగింది. కొత్తూరు, కటికెనపల్లిలో తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు అంటున్నారు. నల్లలింగయ్యపల్లిలో కడారి లాలయ్య ఇంటిపై పిడుగుపడటంతో స్వల్పంగా ధ్వంసమైంది.

మొక్కజొన్న రైతుకు తీరని నష్టం

జూలపల్లి: మండలంలో సుమారు 3,200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ప్రస్తుతం ఆ పంట పీచు దశలో ఉంది. ఈ క్రమంలో కురిసిన భారీ వర్షానికి సుమారు 107 ఎకరాల్లో పంట నేలవాలినట్లు మండల వ్యవసాయాధికారి ప్రత్యూష తెలిపారు. తమను ఆదుకోవాలని రైతులు కల్లెం దామోదర్‌రెడ్డి, కూసి కొమురయ్య కోరారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్‌రూరల్: అకాల వర్షంతో మండలంలోని రేగడిమద్దికుంట, కనుకుల, గర్రెపల్లి, ఐతరాజుపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలమట్టమైంది. దాదాపు 100 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వ శ్రీరాంపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి వడగండ్ల వాన కురిసింది. పొట్టకొచ్చిన దశలో వరి గొలుసులు ధ్వంసమయ్యాయని రైతులు పేర్కొంటున్నారు.

గూడెంలో కూలిన ఇల్లు

ఓదెల: భారీ వర్షానికి మండలంలోని గూడెంలో మూడిళ్లు కూలాయి. వీరముష్టి కుమారస్వామి, మల్లారెడ్డి, సరోజనకు చెందిన ఇళ్లు కూలాయి. ప్రభుత్వం పరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.

ఎలిగేడులో మహిళకు గాయాలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట, ఎలిగేడు, లాలపల్లి, సుల్తాన్‌పూర్, రాములపల్లి, ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామాల్లో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. వడగండ్లతో సుల్తాన్‌పూర్‌కు చెందిన ఓ మహిళ తలకు తీవ్ర గాయమైంది. ర్యాకల్‌దేవుపల్లికి చెందిన దుర్గం రాయలింగు ఇంటి పైకప్పు రేకుల పగిలిపోయాయి.

పెద్దపల్లిలో..

పెద్దపల్లిరూరల్: అకాలవర్షానికి మొక్కజొన్న, వరిపంట నేలవాలింది. బందంపల్లి, చీకురాయి, పెద్దకల్వల, రంగాపూర్, రాఘవాపూర్‌లో పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొంటున్నారు. పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు ఓ అంచనాకు వచ్చారు. ఇప్పటివరకు 1400 ఎకరాల్లో వరి, 130 ఎకరాల్లో మొక్కజొన్న నష్టపోయిందని, నష్టం పెరిగే అవకాశం ఉందని డీఏఓ ఆదిరెడ్డి తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



అకాల వర్షానికి మొక్కజొన్న పంట మొత్తం నేలమట్టమయ్యింది. వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించి రైతులకు నష్టపరిహారం అందేలా చొరవ తీసుకోవాలి.

– శైలేందర్, రైతు మంచరామి, సుల్తానాబాద్

నష్టం అంచనా వేస్తున్నాం



గ్రామాలవారీగా పంట నష్టం అంచనా వేయాలని మండల వ్యవసాయ అధికారులకు సూచించాం. వారి నుంచి నివేదిక తెప్పించుకుని ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– ఆదిరెడ్డి, ఏడీఏ



జూలపల్లిలో నేలవాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు



ఎలిగేడులో కురిసిన వడగండ్లు



సుల్తానాబాద్‌లో మొక్కజొన్న పంటను చూపుతున్న రైతులు

ప్రతిపక్షం లేకుండా కేంద్రం కుట్ర

టీఎస్ ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గోదావరిఖని: దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి.. ప్రతిపక్షాలు లేకుండా బీజేపీ కుట్ర పన్నుతోందని టీఎస్ ఎంఐడీసీ, పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక 4,500 ఈడీ కేసులు పెడితే కేవలం 25 కేసుల్లో మాత్రమే తీర్పు వచ్చాయని, ఈడీ నోటీసులు కావని, మోదీ నోటీసులను ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ లేవనెత్తిన ఒక్క ప్రశ్నకూ సమాధానం లేదన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజలకు మంచి చేసింది ఒక్కటీ లేదన్నారు. సుజనచౌదరికి నోటీసులు ఇచ్చిన బీజేపీ.. పార్టీలో చేరాక కేసులే లేకుండా చేసిందన్నారు. మహిళా అని చూడకుండా ఎమ్మెల్సీ కవితను ఇబ్బంది పెడుతున్నారన్నారు. నిరాధర ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నాయకులు పీటీస్వామి, తోడేటి శంకర్‌గౌడ్, బొడ్డు రవీందర్, తానిపర్తి గోపాల్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ మురళీధర్‌రావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో దేశానికే ఆదర్శం

యైటింక్లయిన్‌కాలనీ: బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎర్రోళ్ల శ్రీనివాస్, కోరుకంటి చందర్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు గడపగడపకూ చేరేలా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. ఈనెల 25లోగా అన్ని ఏరియాలో ఆత్మీయ సమ్మేళనాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. 15, 16, 17, 18, 19 డివిజన్‌లలో నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కాలనీ పట్టణ అధ్యక్షుడు మేడి సదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్ కుమార్, కార్పొరేటర్లు సాగంటి శంకర్, తాళ్ల అమృత రాజయ్య, శంకర్ నాయక్, బాదే అంజలీదేవి, రాంచందర్ నాయకులు, కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

‘గుర్తింపు’ ఎవరికో..?

- నేడు కేశోరాం పర్మినెంట్ కార్మిక సంఘం ఎన్నికలు
- ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



కేశోరాం సిమెంట్ కర్మాగారం

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీ పర్మినెంట్ కార్మికసంఘం ఎన్నికలు సోమవారం జరుగనున్నాయి. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు బ్యాలెట్ పద్ధతిన నిర్వహించే ఈ ఎన్నికల్లో ముగ్గురు బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి ఇంజపూరి నవీన్‌కుమార్, కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ తరఫున సూర సమ్మయ్య పోటీ చేస్తున్నారు. 263 మంది కార్మికులున్న కేశోరాం కంపెనీలో పోలింగ్ కోసం ఎన్నికల అధికారి డానియల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉదయం 5.30గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు పోలింగ్, సాయంత్రం నాలుగు గంటలకు ఓట్ల లెక్కింపు, విజేతల ప్రకటన ఉంటుంది.

వసతులు ఎలా ఉన్నాయ్..!

- నేడు సుల్తానాబాద్‌కు కాయకల్ప బృందం
- కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిశీలన
- గత జనవరి 5న ఎన్‌హెచ్‌ఎం బృందం సందర్శన



సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రస్తుతం వైద్య విధాన పరిషత్)ను సోమవారం కాయకల్ప బృందం పరిశీలించనుంది. ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతున్న క్రమంలో చుట్టుపక్కల శుభ్రత, పరిశుభ్రత ఎలా ఉంది..? రోగులకు అందుతున్న సేవలు..? రోగులతో సిబ్బంది ఎలా వ్యవహరిస్తున్నారు..? శానిటేషన్, బయోమెడిసిన్ నిర్వహణ, స్టెరిలైజేషన్, రికార్డుల నిర్వహణ, హైజనిక్‌కిట్స్‌తోపాటు 350 పాయింట్లను సర్వే బృందం పరిశీలించనుంది. అన్ని బాగుంటే ఆసుపత్రికి స్వచ్ఛఅభియాన్ అవార్డు అందించనున్నారు. ఈ క్రమంలో ఆసుపత్రి సిబ్బంది అప్రమత్తమయ్యారు. రికార్డులు సిద్ధం చేశారు. పరిసరాలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. గత జనవరి ఐదున జాతీయ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) అధికారుల బృందం సందర్శించింది. ఇక్కడి సౌకర్యాల నివేదికను కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయంలో అందించింది. పనితీరు బాగుందని నివేదిక ఇవ్వడంతో తాజాగా రెండోసారి రాష్ట్ర కమిటీ బృందం సందర్శించనుంది. సంతృప్తి వ్యక్తం చేస్తే అవార్డు వచ్చే అవకాశం ఉంది. బృందంలో మహబూబ్‌నగర్‌కు చెందిన త్రిమెన్ కమిటీ డాక్టర్ శ్వేత (పీఓ), శ్రావణ్ (డబ్ల్యూహెచ్ఓ), రాజ్యలక్ష్మి (నర్సింగ్ సూపరింటెండెంట్)ని ప్రభుత్వం నియమించింది.

పరిశీలన ఇలా..

ఆసుపత్రిలో రోగాల నియంత్రణ పద్ధతులు, నిర్వహణ, పారిశుద్ధ్యం పరిశుభ్రత మెరుగుపరచడం, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించడం, స్వచ్ఛత, ప్రజారోగ్యం, హెల్త్‌కేర్ సదుపాయాల్లో సపోర్ట్‌లో 70శాతం కంటే ఎక్కువ మార్కులు స్కోర్ చేయాల్సి ఉంటుంది. ఇలా చేస్తే ఆసుపత్రిలో మరిన్ని సౌకర్యాలకు రూ.15లక్షల నుంచి రూ.30లక్షల వరకు బహుమతి అందుకునే అవకాశం ఉంది. ఆసుపత్రి పారిశుధ్య నిర్వహణలో గతంలో సీహెచ్‌సీ రూ.లక్ష బహుమతి అందుకున్న విషయం తెల్సిందే.

బయోవేస్టేజీకు ప్రత్యేక బహుమతి

ఆసుపత్రిలో బయోవేస్టేజీ సక్రమంగా చేస్తే దానికి ప్రత్యేక బహుమతిని ప్రకటించే అవకాశం ఉందని ఎన్‌హెచ్‌ఎం క్వాలిటీ సెల్ అధికారి అనిల్ తెలిపారు. ప్లాస్టిక్ వాడకుండా పేపర్లు, గ్లాసులను ఉపయోగిస్తే అదనంగా రూ.5లక్షల అవార్డు గెలుచుకునే అవకాశం ఉంది. దీనికోసం స్థానిక అధికారులు, సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ఆస్పత్రి ముందు భాగంలో పరిశుభ్రత ఉండేలా చూస్తున్నారు.

అవార్డు సాధిస్తాం..



ఆస్పత్రిలో రోగులకు ప్రస్తుతం మెరుగైన సేవలు అందిస్తున్నాం. డెలివరీలు గణనీయంగా పెరిగాయి. జనరల్ వ్యాధులు సోకిన రోగులకు ఇక్కడే వైద్యసేవలు అందిస్తున్నాం. ప్రతి వస్తువునూ ప్రతిరోజూ స్టెరిలైజేషన్ చేస్తున్నాం. గతంలో రూ.లక్ష అవార్డు సాధించాం. ఈసారి మొదటి అవార్డును పొందుతామన్న భరోసా ఉంది.

– డాక్టర్ రమాదేవి, డీడీఓ, సుల్తానాబాద్

ప్రతి గదీ సందర్శన

ఆసుపత్రిలో ఉన్న డెలివరీ గదితోపాటు రోగులు ఉండే జనరల్ వార్డులు, ఇతర వార్డులను బృందం సందర్శించనుంది. వార్డుల్లో ఉండే బెడ్‌షీట్లు మొదలు సామగ్రి, స్టెరిలైజేషన్, నిత్యం శుభ్రం చేస్తున్నారా..? తెలుసుకోనున్నారు. ఆస్పత్రిలో ఉన్న ఫార్మసీ, ల్యాబ్, ఎక్స్‌రే, మూత్రశాల, మరుగుదొడ్ల శుభ్రతను పరిశీలించి మార్కులు కేటాయించనున్నారు. 350 పాయింట్లు ఉండగా అందులో వారు కేటాయించిన మార్కులను బట్టి అవార్డు దక్కే అవకాశాలు ఉన్నాయి.

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం పాదయాత్ర

గోదావరిఖనిటౌన్(రామగుండం): ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని సంగ్రామ పాదయాత్ర చేపడతామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి శామ్యూల్ తెలిపారు. ఆదివారం స్థానిక బాపూజీనగర్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాము అధికారంలోకొస్తే 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని, ఇప్పుడు మర్చిపోయిందని పేర్కొన్నారు. వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టకుంటే రాబోయే ఎన్నికల్లో బీజేపీని మట్టి కరిపిస్తామన్నారు. ఇందులో భాగంగా సంగ్రామ పాదయాత్ర మొదలవుతుందన్నారు. ఈనెల 27, 28 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మంద రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పల్లె బాపు, కాశిపేట రాజయ్య, గుండ్ల రాకేష్, ఈదునూరి కొమురయ్య, ఏలూరు రాంబాబు, గద్దల అనిల్‌కుమార్, మైన రవీందర్, కన్నూరి రాజ్‌కుమార్, చిట్యాల వెంకటేశ్, బోయ రాజు, కాంపల్లి శ్రీనివాస్, ఆవునూరి లింగమూర్తి, కాజీపేట పోశం తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ పాలసీ అమలు చేయాలి


ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అశోక్

మల్లాపూర్(కోరుట్ల) : గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎన్ఆర్ఐ పాలసీ ఏర్పాటు చేయాలని బీజేపీ యూఏఈ కో-కన్వీనర్ పెనుకుల అశోక్ కోరారు. ఆదివారం దుబాయిలో బీజేపీ యూఏఈ శాఖ ఆధ్వర్యంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉపాధి కోసం ఏడారి దేశాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అమాయక కార్మికులు నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోతున్నారని, గల్ఫ్ దేశాలకు వలస వచ్చి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి గల్ఫ్ బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని పేర్కొన్నారు. వలసజీవుల వెతలు తీరాలంటే కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఐ పాలసీని ప్రకటించాలన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే గల్ఫ్ కార్మికుల విన్నపాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఎన్ఆర్ఐ పాలసీపై ప్రభుత్వం ప్రకటన చేయాలని అసెంబ్లీలో లేవనెత్తుతాని హామీ ఇచ్చారన్నారు.యూఏఈ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలప పట్టివేత

మేడిపెల్లి(జగిత్యాల): బీమారం మండలంలోని మన్నెగూడెంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను అటవీ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. రూ.5 లక్షల విలువ గల టేకు కలపను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ ఎఫ్ఆర్వో రవికుమార్, బీట్ ఆఫీసర్ ప్రదీప్ పాల్గొన్నారు.

ఆగని రేషన్ బియ్యం దందా

- మంథని టు మహారాష్ట్ర
- పార్వతీ బ్యారేజీ, వంతెనల మీదుగా అక్రమ రవాణా
- 6ఏ కేసులతోనే సరిపెడుతున్న అధికారులు


సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీ, వంతెన


మంథని పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

మంథని: ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేసే సబ్సిడీ బియ్యాన్ని అక్కమార్కులు పక్కదారి పట్టిస్తున్నారు. అధికారులు అడపాదడపా చేసే తనిఖీల్లో ఎవరైనా పట్టుబడితే 6ఏ కేసులతోనే సరిపెడుతున్నారు. దీంతో వ్యాపారులు తమ దందాను ఓ వారం రోజులు ఆపేసి, మళ్లీ షరామామూలే అన్నట్లుగా కొనసాగిస్తున్నారు.

రెండు రోజుల్లో 25 క్వింటాళ్లు..

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మంథని మండలం సిరిపురం సమీపంలో నిర్మించిన పార్వతీ బ్యారేజీ, పలుచోట్ల నిర్మించిన వంతెనలు అక్రమార్కులకు వరంగా మారాయి. బ్యారేజీ మీదుగా మంచిర్యాల జిల్లా దాటి మహారాష్ట్రకు బియ్యాన్ని చేరుస్తున్నట్లు సమాచారం. గత రెండు రోజుల్లో 25 క్వింటాళ్ల బియ్యం పోలీసులకు పట్టుబడటమే దీనికి ఉదాహరణ. సీసీ కెమెరాలు లేకపోవడంతో దందా యథేచ్ఛగా సాగుతోంది.

మంథనికి చెందిన ఓ వ్యాపారి, తన అనుచరులు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్, కాటారంతోపాటు ఇతర మండలాలు, గోదావరిఖని, పెద్దపల్లి సమీప ప్రాంతాల నుంచి మంథనికి చెందిన ఓ వ్యాపారి తన అనుచరులతో బియ్యం సేకరించి, మహారాష్ట్రకు తరలిస్తున్నాడు. అక్కడి జిల్లాల్లో సన్నపు బియ్యానికి ఎక్కువ డిమాండ్ ఉండటంతో జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలుతోంది. కాగా చాలా మంది లబ్ధిదారులు రేషన్ డీలర్లకే రూ.6 నుంచి రూ.8లకు బియ్యం అప్పగిస్తున్నట్లు సమాచారం. వ్యాపారులు రూ.10కి డీలర్ల వద్ద సేకరించి, మహారాష్ట్రలో కిలో రూ.20కి విక్రయిస్తున్నట్లు తెలిసింది. పెద్దపల్లి జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి సేకరించిన బియ్యాన్ని ముత్తారం మండలంలోని ఓచోట నిల్వ ఉంచి, మినీ వ్యాన్లు, లారీల్లో తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఉదాసీనంగా వ్యవహరించడమే కారణం..

జిల్లాలో పలుచోట్ల సబ్సిడీ బియ్యం పట్టుబడుతుంటే అప్పటికప్పుడు 6ఏ కేసులతో సరిపెడుతున్నారు. అక్రమ దందా చేస్తున్న వ్యాపారి ఎవరో అధికారులకు తెలుసు. వ్యాపారుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడమే అక్రమ దందాకు ఊతమిస్తోందన్న ఆరోపణలున్నాయి. కొంతమంది బినామీ పేర్లు వాడుతూ కేసులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు దృష్టిసారిస్తే బియ్యం దందాను అడ్డుకోవచ్చని అభిప్రాయపడుతున్నారు.

దుకాణాలపై నిఘా



రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేయకుండా పక్కదారి పట్టించే దుకాణాలపై నిఘా పెట్టాం. మంథని మండలంలోని కన్నాలలో ఓ రేషన్ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం పట్టుకొని, షాపును సీజ్ చేశాం. మరో ఇద్దరు డీలర్లపై అనుమానాలున్నాయి. కార్డుదారులు బియ్యాన్ని డీలర్లు, వ్యాపారులకు విక్రయించొద్దు. అలాంటి వారి సమాచారం అందిస్తే కార్డు రద్దుకు సిఫారసు చేస్తాం.

– బండి ప్రకాశ్, తహసీల్దార్, మంథని

ముగిసిన ఎఫ్ఏ మార్కుల పరిశీలన

- జిల్లాలో 216 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు
- పదోతరగతి పరీక్షలు రాయనున్న 7937 మంది విద్యార్థులు
- అంతర్గత మార్కులు కలిపి తుది ఫలితాల ప్రకటన


సుల్తానాబాద్‌లో రికార్డులు పరిశీలిస్తున్న టీం సభ్యులు (ఫైల్)

సుల్తానాబాద్(పెద్దపల్లి): పదోతరగతి విద్యార్థుల ఫార్మేటివ్ అసెస్మెంట్(ఎఫ్ఏ, అంతర్గత) మార్కుల పరిశీలన ముగిసింది. కరోనా తర్వాత మొదటిసారిగా ప్రభుత్వం 06 పేపర్లతో పరీక్షలు నిర్వహించనుంది. దానికంటే ముందుగా ప్రతి ఉన్నత పాఠశాలలో సర్కారు నియమించిన కమిటీ సభ్యులు విద్యార్థుల రికార్డులు, అంతర్గత మార్కులను పరిశీలించింది.

జిల్లాలో 14 మండలాలు..

పెద్దపల్లి జిల్లాలో 14 మండలాలు, పెద్దపల్లి, సుల్తానాబాద్, రామగుండం, మంథని మున్సిపాలిటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థుల ఎఫ్ఏ మార్కులపై కమిటీ సభ్యులు నివేదిక రూపొందించి, ఎంఈవో ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి పంపించనున్నారు. జిల్లాలో మొత్తం 37 ప్రత్యేక బందాలు ఈ ప్రక్రియలో పాలుపంచుకున్నాయి. అంతర్గత మార్కులను పోర్టల్‌లో నమోదు చేసేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 216(ప్రభుత్వ ఉన్నత 83, ప్రైవేటు ఉన్నత 133) పాఠశాలల నుంచి ఈ ఏడాది 7937 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు.

విద్యార్థుల భవితకు ఎంతో కీలకం

అంతర్గత మార్కులు విద్యార్థుల భవితకు ఎంతో కీలకంగా మారనున్నాయి. వీటి కేటాయింపులో అవకతవకలకు చోటు లేకుండా మండల స్థాయి బృందాలతో తనిఖీలు చేయించారు. రాత పరీక్షల్లో 80 మార్కులకు గాను విద్యార్థులు సాధించినవి, అంతర్గత మార్కులు 20కి గాను వచ్చినవాటిని కలిపి వార్షిక పరీక్షల తుది ఫలితాలు ప్రకటించనున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించకుండా ఉత్తీర్ణతాశాతాన్ని పెంచుకోవడానికి అంతర్గత మార్కులు అధికంగా నమోదు చేసే అవకాశాలున్నాయి. ఈ కారణంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఎఫ్ఏ మార్కులతోపాటు విద్యార్థులు రాసిన సమాధాన పత్రాల మూల్యాంకనాన్ని పరిశీలించారు.

20లోగా నమోదు చేయాలి



పదోతరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌లో ఈ నెల 20లోగా నమోదు చేయాలి. ఇప్పటికే ఎంఈవోలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. గడువులోగా పూర్తి చేస్తాం.

– మాధవి, డీఈవో

‘లక్ష్య’కు రామగుండం జీజీహెచ్


రామగుండం జీజీహెచ్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) జాతీయ లక్ష్య కార్యక్రమానికి ఎంపికైనట్లు మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదివారం ప్రకటించింది. రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిన జీజీహెచ్ ఆస్పత్రి 2019లో కూడా ‘లక్ష్య’కు ఎంపికై రూ.4 లక్షల నగదు అందుకుంది. తాజాగా లేబర్ రూమ్ సేవలకు 76 శాతం మార్కులు, మెటర్నిటీ ఓటీ సేవలకు 77 శాతం మార్కులు సాధించింది. తద్వారా లేబర్ రూంకు రూ.2లక్షలు, మెటర్నిటీ ఓటీకి మరో రూ.2లక్షల నగదు పొందనుంది. ఇలా మూడేళ్లపాటు సేవలను మెరుగుపరిస్తే ఏటా రూ.4లక్షల చొప్పున కేంద్రం నుంచి ఆస్పత్రికి లక్ష్య పథకం ద్వారా నిధులు మంజూరు కానున్నాయి. ఈ ఏడాది జనవరి 28న ఆస్పత్రిలో ప్రసూతి సేవలను మెరుగుపర్చడంతోపాటు మెటర్నటీ ఓటీ వినియోగం తీరుపై కేంద్ర బృందం తనిఖీ చేసి అసెస్మెంట్‌ను కేంద్రానికి నివేదించారు. ఈ నివేదిక ఆధారంగా లక్ష్యకు ఎంపికయింది. మాతా, శిశుమరణాల రేటును తగ్గించడానికి.. సుఖ ప్రసవం జరిగేలా ఏటా కేంద్ర ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ ద్వారా లక్ష్య ప్రోగ్రాం పేరుతో ప్రభుత్వ ఆస్పత్రులకు పోటీలు నిర్వహిస్తోంది. రెండోసారి ఆస్పత్రి ఎంపిక కావడం పట్ల ఆసుపత్రి అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలి

- టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీక్‌పై కాంగ్రెస్ నాయకుల నిరసన


రోడ్డుపై నిరసన తెలుపుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: టీఎస్‌పీఎస్సీ పేపర్లు లీక్ అయినా పట్టించుకోని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదని, వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు సూచన మేరకు ఆదివారం పెద్దపల్లిలోని రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించి, నిరసన తెలిపారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పరీక్షలు రాసిన నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సిరిసిల్లలో ఓ నిరుద్యోగి తన నిండుప్రాణాలను తీసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సంపత్, తూముల సుభాష్‌రావు, నాయకులు శ్రీమాన్, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, సంతోష్, సర్వర్‌పాషా, వెంకటేశ్, నర్సయ్య, తూముల మహేశ్, తిరుమలేశ్, శ్రీకాంత్, శ్రవణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

కోనరావుపేట(వేములవాడ): ధర్మారం ప్రాథమిక పాఠశాలలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సామగ్రి, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు 2022–23 విద్యా సంవత్సరానికి గాను రూ.30 వేలు మంజూరయ్యాయి. ఎస్ఎంసీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు జాయింట్ చెక్ పవర్ ఉండడంతో డబ్బులు డ్రా చేశారు. డబ్బులను తీసుకున్న ప్రధానోపాధ్యాయురాలు సామగ్రి వివరాలను తెలుపకపోవడంతో పాఠశాల స్థాయి సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. పలు సమావేశాల్లో ఇదే విషయంలో వాగ్వాదం జరుగుతుండడంతో ఎంఈవో, డీఈవోకు సైతం ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఎంఈవో దూస రఘుపతిని వివరణ కోరగా ఇప్పటివరకు లిఖితపూర్వక ఫిర్యాదు రాలేదన్నారు. విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి


అభివాదం చేస్తున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ప్రదీప్, రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని టీవీ గార్డెన్స్‌లో ఐఎఫ్‌టీయూ పెద్దపల్లి జిల్లా 8వ మహాసభల్లో భాగంగా నిర్వహించిన ప్రతినిధుల సభలో మాట్లాడారు. ప్రభుత్వ రంగం పూర్తిగా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిందన్నారు. 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా తీసుకురావడంతో కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. పరిశ్రమల్లో అమలులో ఉన్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా ఎత్తివేశారని తెలిపారు. దేశంలోని కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్లు ఐక్యంగా ఉద్యమిస్తున్నాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని మండిపడ్డారు. అనేక ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగులను పక్కనబెట్టి, కాంట్రాక్ట్ వర్కర్లతో పనులు చేయిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేష్ జెండావిష్కరణ చేశారు. సభకు అధ్యక్ష వర్గంగా నరేష్, అశోక్, చిలుక శంకర్‌లు వ్యవహరించగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.వెంకన్న అమరుల సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. వివిధ రంగాల నుంచి 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న, రాష్ట్ర కార్యదర్శి ఐ.కృష్ణ, నాయకులు వెంకన్న, మొగిలి, బుచ్చయ్య, బుచ్చమ్మ, జ్యోతి తదితరులున్నారు.

లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి

- మజ్దూర్ యూనియన్ డివిజనల్ ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి రవీందర్
- నేడు దేశవ్యాప్త నిరసనలు


లోకో ఆర్‌వోహెచ్ షెడ్

రామగుండం: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి సోమవారం రైల్వేస్టేషన్లలోని క్రూ లాబీ కార్యాలయాల ఎదుట నిరసన తెలపనున్నట్లు సికింద్రాబాద్ డివిజనల్ ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి రవీందర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం రామగుండం రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైల్వేబోర్డు/జోనల్ అధికారులు రన్నింగ్ స్టాఫ్‌ను కట్టుబానిసలుగా భావిస్తూ కార్మిక వ్యతిరేక ఉత్తర్వులతో మనోవేదనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రన్నింగ్ రూంలో తమ కుటుంబసభ్యులతో కూడా ఫోన్ మాట్లాడకుండా మొబైల్స్ డిపాజిట్ చేయాలనే నిబంధన ఎత్తివేయాలన్నారు. అధిక పని భారాన్ని తగ్గించి, నిబంధనల మేరకు పని గంటలు ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, 36 గంటల్లోగా లోకో పైలట్, గార్డు హెడ్‌క్వార్టర్‌కు చేరుకునేలా చూడాలన్నారు. మహిళా లోకో పైలట్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్లకు 6 గంటలకు మించి పని గంటలు ఉండొద్దన్నారు. రన్నింగ్ స్టాఫ్ పనిచేసే బీట్‌లను నిర్ధారించి, అమలు జరిగేలా చూడాలని, పదోన్నతులు త్వరితగతిన అమలు చేయాలని, లైన్ బాక్స్‌లను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. నిరసన కార్యక్రమానికి సిబ్బంది తమ కుటుంబసభ్యులతో హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

ఇళ్లస్థలాల పట్టాలిచ్చేవరకూ పోరాటం ఆగదు


మాట్లాడుతున్న కుమారస్వామి

గోదావరిఖని(రామగుండం): పోలీసులు రాత్రిపూట జెండాలు తీసేసినంత మాత్రాన భూపోరాటం ఆగదని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల కుమారస్వామి అన్నారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూపోరాటం ఆదివారం రెండోరోజుకు చేరింది. వందలాది మంది నిరుపేదలు గుడిసెలు వేసుకోవడానికి చెట్లు కొట్టి, జెండాలు పాతారన్నారు. పోలీసులు రాత్రిపూట వచ్చి, వాటిని తొలగించారని తెలిపారు. కబ్జాదారుల నుంచి భూములను కాపాడాల్సిన వారు ఆ పని చేయకుండా పేదలు వేసుకున్న జెండాలు తీసివేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వానికి చేతనైతే కబ్జాదారుల నుంచి ప్రభుత్వ స్థలాలు కాపాడాలన్నారు. నిరుపేదలకు ఇళ్లస్థలాల పట్టాలిచ్చేవరకూ తమ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎ.మహేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు మెండె శ్రీనివాస్, లావణ్య, నాయకులు ఫైముద, పీర్ మహమ్మద్, నాగమణి, లలిత, ఓదెలు, గోపాల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించండి


మాట్లాడుతున్న యాకయ్య


జ్యోతినగర్(రామగుండం): రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని, నిరుపేదల ఇళ్ల కోసం కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలోని ప్రభుత్వ భూమిలో జెండాలను పాతారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని చెప్పి, పదేళ్లవుతున్నా ఇవ్వలేదన్నారు. కబ్జాదారుల నుంచి భూమిని రక్షించేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి, జిల్లా కమిటీ సభ్యుడు నాంసాని శంకర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, మహేశ్వరి, లావణ్య, నాయకులు అక్కపాక శంకర్, సాంబయ్య, దేవేంద్ర, ఉపేందర్, రమణ, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సంపత్, వేణు తదితరులు పాల్గొన్నారు.

నేతకాని మహర్‌లు అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): నేతకాని మహర్ ప్రజల హక్కుల రక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని నేతకాని మహర్ కుల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ అధ్యక్షుడు గోమాస శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేతకాని మహర్ సామాజికవర్గానికి చెందిన వారు రాష్ట్రంలో 15 లక్షల మందికి పైగా ఉన్నారని తెలిపారు. వీరందరూ రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఆర్థికపరంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం పలు అంశాలపై తీర్మానం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్‌తోపాటు నాలుగు అసెంబ్లీ స్థానాలు నేతకాని మహర్ సామాజికవర్గానికి కేటాయించాలని కోరారు. అటవీ ప్రాంతంలో నివసిస్తున్న నేతకాని గిరిజనేతరులకు పోడు భూములకు భూయాజమాన్య హక్కు పత్రాలు ఇచ్చి, క్రయవిక్రయాలు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసి, అసైన్డ్, పోరంబోకు, ఇనాం భూములు కలిగిన ఎస్సీలందరికీ భూయాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోదావరి పరివాహక ప్రాంతంలో వరద ముంపునకు గురవుతున్న ఆయా గ్రామాల ఎస్సీలందరికీ ఇసుక రీచ్ టెండర్లలో రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న వారికి ఐటీడీఏ తరహా ప్రత్యేక ఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. సింగరేణి భూ నిర్వాసితులకు కనీస వసతులతోపాటు ఇంటికో ఉద్యోగం కల్పించాలన్నారు. నాయకులు జవ్వాజి తిరుపతి, దుర్గం ఎల్లయ్య, రత్నం ప్రదీప్, నాగరాజు, అంతర్గాం రాజమౌళి, ఇప్పుల గంగారం, హెచ్ఎంఎస్ నాయకులు రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదమే ప్రాణాలు తీసింది


రోదిస్తున్న మృతుడి భార్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఓ రైతు తన పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేసే విషయంలో తల్లి దండ్రులు అంగీకరించడం లేదని మనస్తాపంతో పురుగులమందు తాగగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ సంఘటన స్థానికంగా విషాదం నింపింది. జన్మనిచ్చిన తల్లిదండ్రులే భూమి ఇవ్వడంలో వివాదంగా వ్యవహరించడంతో తన భర్త మనోవేదనకు గురై క్రిమిసంహారక మందు తాగాడని మృతుని భార్య మానస ఆరోపించింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డిపేటకు కేంద్రానికి చెందిన బింగి సురేశ్ (35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో రెండు ఎకరాల భూమిని తన పేరిట చేయాలని కోరాడు. తల్లిదండ్రులు నిరాకరించడంతో ఆవేదనకు లోనైన సురేశ్ కిష్టంపల్లి శివారులో గత శుక్రవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. సురేశ్ తండ్రి లచ్చయ్యకు ముగ్గురు కొడుకులు కాగా.. రెండో కుమారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. తన భర్త మృతితో తాము రోడ్డున పడ్డామని భార్య మానస విలపించింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.